కర్నూలులో హైకోర్టు బెంచ్

- న్యాయ శాఖ సమీక్షలో సీఎం ప్రకటన
- ప్రక్రియ వేగవంతం చేయాలని న్యాయవాదుల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారు. సోమవారం అమరావతిలో న్యాయ శాఖపై సమీక్ష నిర్వహించిన ఆయన ఈ మేరకు ప్రకటించారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. దీంతో అమరావతిలో హైకోర్టు కొనసాగుతూనే హైకోర్టు బెంచ్ కర్నూలులో అందుబాటులోకి రానుంది. అమరావతిలో వంద ఎకరాల్లో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గతంలో అధికారంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని, హైకోర్టు కర్నూలుకు తరలిస్తామని పలు సార్లు ప్రకటనలు చేశారు. అయితే కర్నూలు హైకోర్టు ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదనలూ పంపలేదు. కర్నూలు నగర శివార్లలోని జగన్నాథ గట్టు సమీపంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు. అది కూడా శంకుస్థాపనకే పరిమితమైంది. తరువాత ఎలాంటి పనులూ చేపట్టలేదు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేశారు. ఆ నేపథ్యంలో కర్నూలుకు వచ్చిన చంద్రబాబు నాయుడును వైసిపి నాయకులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో యువగళం పాదయాత్ర చేపట్టిన సందర్భంగా టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీల మేరకు టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రకటన చేశారు. దీనిని కర్నూలు న్యాయవాదులు స్వాగతిస్తున్నారు. వీలైనంత త్వరగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

త్వరగా ఏర్పాటు చేయాలి

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేయడం సంతోషదాయకం. దీన్ని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తరపున స్వాగతిస్తున్నాం. ఇది శుభపరిణామం. జగన్ కర్నూలులో హైకోర్టు పెడతామని చెప్పినా కేంద్రానికి ఎలాంటి ప్రతిపాదనా చేయలేదు. ఇప్పుడు చంద్రబాబు ప్రకటించిన హైకోర్టు బెంచ్‌ను త్వరగా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- కెంగార కుమార్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు.

కర్నూలు ప్రభుత్వాసత్రిలో దళిత గోవిందమ్మను పరామర్శిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష, ఎస్పి బిందు మాధవ్

బతుకు భారం..!

- పని ఉంటేనే పైసా
- దుర్భరంగా విద్యుత్ శాఖ హమాలీల బతుకులు

విద్యుత్ శాఖలో పని చేసే స్టోర్ హమాలీల బతుకులు దుర్భరంగా సాగుతున్నాయి. పీస్ రేటు ప్రకారం కూలి చెల్లిస్తుండటంతో పని ఉంటేనే పైసా దక్కుతోంది. పని లేని సమయాల్లో పూట గడవడం కష్టంగా మారుతోంది. ఏళ్ల కాలంగా పని చేస్తున్నా వారి సమస్యలను పట్టించుకునే నాథులు కరువయ్యారు...

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ శాఖలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ పరిధికి సంబంధించి కర్నూలు నగరంలో స్టోర్ ఉంది. అందులో 15 మంది హమాలీలు పని చేస్తున్నారు. స్టోర్‌కు వచ్చే విద్యుత్ పరికరాలను ఎత్తడం, దింపడం వారు చేయాల్సి ఉంటుంది. వారికి ఎత్తిన, దింపిన వస్తువును బట్టి పీస్ రేటు చెల్లిస్తారు. చిన్న వస్తువుకు రుపాయి నుంచి గరిష్టంగా పెద్ద వస్తువుకు రూ.300 వరకూ చెల్లిస్తారు. ఆ రోజంతా చేసిన పనికి వచ్చిన మొత్తాన్ని అందరూ పంచుకోవాల్సి ఉంటుంది. పని చేస్తేనే కూలి వస్తుంది. లేకుంటే ఆ రోజు ఉత్తిచేతులతో వెళ్లాల్సిందే. ప్రస్తుతం మూడు నెలలుగా పని లేదు. దీంతో హమాలీల జీవనం గడవడం కష్టంగా మారింది. పనిచేసే సమయంలో దెబ్బలు తగిలినా, ఏదైనా అనారోగ్యం తలెత్తినా స్వంతంగా వైద్యం చేయించుకోవాల్సిందే. వారికి ఎలాంటి ఆరోగ్య సదుపాయాలూ కల్పించడం లేదు. పిఎస్ సౌకర్యం కూడా లేదు. ఏళ్ల కాలంగా సంస్థను నమ్ముకుని పని చేస్తున్నా వారి సమస్యల వైపు కన్నెత్తి చూసే నాథులే కరువయ్యారు. పిఎస్ సౌకర్యం కూడా లేదు. ఎలాంటి అలవెన్సులూ ఇవ్వడం లేదు. ఏళ్ల కాలంగా ఒకేరకరమైన పీస్ రేటును చెల్లిస్తున్నారు. హమాలీలకు చెల్లించే పీస్ రేటును పెంచాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. లేబర్ వెల్ఫేర్ సొసైటీలో సభ్యులుగా ఉన్నా కూడా ఒప్పందం ప్రకారం పనులు కల్పించడం లేదు. వారి సమస్యలను అధికారులకు పలు సార్లు విన్నవించారు. హమాలీల సమస్యలను సిఎండి దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నా ఏ ఒక్క హామీ కూడా అమలు కావడం లేదు.

కడుపు నిండా తిండి దొరికే పరిస్థితి లేదు

1998 నుండి స్టోర్ హమాలీగా పని చేస్తున్నా. 2014 నుండి లేబర్ సొసైటీలో సభ్యునిగా ఉన్నా. రెక్కలు ముక్కలు చేసి పనిచేసినా నెలకు రూ.15వేలు కూడా రావడం గగనమే. కార్మికుల కోసం ఈఎస్‌ఐ ఆసుపత్రి ఉన్నా అక్కడ వైద్యం చేయించుకోవడానికి వెళ్తే కనీసం షుగర్ మాత్రలు కూడా ఉండవు. 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కడుపు నిండా తిండి దొరికే పరిస్థితి లేదు. మాకు పిఎఫ్‌కల్పించి ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆదుకోవాలి. సంస్థను నమ్ముకుని పని చేసే వారందరిని రెగ్యులర్ చేయాలి. ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపచేయాలి. లేబర్ చట్టాలన్నీ వర్తింప చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- కె.మోహన్, స్టోర్ హమాలీ.

రెగ్యులర్ చేయాలి

గత 28 సంవత్సరాలుగా పనిచేసున్నా ఇంతవరకు రెగ్యులర్ చేయలేదు. చేసిన పనికి వచ్చిన ఆదాయము ఇంటి బాడుగలకు, ఖర్చులకు సరిపోతున్నాయి. సొంత ఇల్లు కూడా లేదు. చాలీచాలని జీతాలతో అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రస్తుత ధరలకు అనుగుణంగా పీస్ రేటు పెంచాలి. సొసైటీలో ఉన్న వారికి పనులు కల్పించాలి. ప్రమాదం జరిగితే చూయించుకునేందుకు ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి.

- జి.సురేష్, స్టోర్ హమాలీ.

ఆరోగ్య బీమా కల్పించాలి

గత 30 సంవత్సరాలుగా సంస్థను నమ్ముకుని పనిచేస్తున్నా కనీసం ఆరోగ్య బీమా కూడా లేదని ఆవేదన. నగరంలో కుటుంబంలోని అందరూ పని చేస్తే గాని కుటుంబాలు గడవని పరిస్థితి. కార్మికుల చట్టాలు అమలు చేసి పనులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రమాదాలు జరిగినా, అనారోగ్యాల పాలైనా ఆరోగ్యశ్రీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పి.నాగరాజు, స్టోర్ హమాలీ.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- మెప్మా ఆర్పీల ధర్నాలో పిఎస్.రాధాకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మెప్మాలో పనిచేస్తున్న ఆర్‌పిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్పీల అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నగర కార్యదర్శి ఎస్.షభాన అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలోసిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్ రాధాకృష్ణ, మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం జిల్లాకార్యదర్శి ఎస్.ఉమాదేవి మాట్లాడుతూ ఆర్పీలకు పెండింగులో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లింపునకు ప్రత్యేకంగా వార్షిక బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలన్నారు. టిఎ, డిఎ సౌకర్యాలను కల్పించడమే కాకుండా అర్హత కలిగిన వారికి సిఒ డిఇఒలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు టి రాముడు, రఫి, నగర అధ్యక్షులు పి.రుద్రమ్మ, ఉపాధ్యక్షులు సుజాతప్రసాద్ నాయకులు సుజాత, శ్రీదేవి, కైరున్, లక్ష్మీబాయ్, బి.జ్యోతి, సాయి, కృష్ణమ్మ, వరలక్ష్మి, అరుణ ,గూడూరు నాయకులు అనసూయ, సంధ్య, కళావతి, రేణుక, ఆర్పీలు, పర్విన్, ఝాన్సీ, కన్యక, లలిత, ముంతాజ్, లక్ష్మీ, సి. మంజుల, రమీజాబి, అరుణ, భాను, సరస్వతి పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాధాకృష్ణ

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

జిఒ 77ను తక్షణమే రద్దు చేయాలి

- విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఉన్నత విద్యకు శాపంగా మారిన జిఒ 77ను ప్రభుత్వం రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించా లని కోరుతూ విద్యార్థులతో ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు రంగప్ప అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి అబ్దుల్లా మాట్లాడారు. ప్రభుత్వ జూని యర్ కళాశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. మెడికల్ విద్యను ప్రభుత్వమే కొనసాగించి 107, 108 జీవోలను రద్దు చేయాలన్నారు. ఆదోని మెడికల్ కళాశాల పనులు వెంటనే పూర్తి చేసి క్లాసులు ప్రారంభించాలన్నారు. రాయలసీమవర్సిటిలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేసి హాస్టల్లో మౌలిక వసతులు కల్పించలాన్నారు. , ప్రభుత్వ పాఠశాలలో టీచర్ పోస్టులు విద్యా వాలంటరీ ద్వారా భర్తీ చేసి 117 జీవో ను రద్దు చేయాలన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలన్నారు. ఇతర విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్ సాయి , జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్, కాజా, నగర నాయకులు రాజు యువరాజ్ పాల్గొన్నారు.

దళిత గోవిందమ్మకు

ప్రభుత్వం అండగా ఉంటుంది

- జిజిహెచ్‌లో దళిత గోవిందమ్మను పరామర్శించిన కలెక్టర్ రంజిత్ బాష, ఎస్‌పి బిందు మాధవ్

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుందని, భయపడవద్దని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న దళిత మహిళ గోవిందమ్మను జల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష, ఎస్‌పి బిందుమాధవ్ భరోసా ఇచ్చారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని కార్డియోతోరాసిక్ అండ్ వాస్కులార్ సర్జరీ(సిటివిఎస్) వార్డ్‌లో పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత గోవిందమ్మను కలెక్టర్, ఎస్‌పి పరామర్శించారు. ఈ నెల 12న ఘటన జరుగుతున్న సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి వచ్చారా? ట్రీట్మెంట్ ఏ విధంగా జరుగుతోంది? వైద్యులు సరిగా చూసుకుంటున్నారా ? ఆరోగ్య పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందని బాధిత మహిళ గోవిందమ్మను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసానిచ్చారు. అక్కడే ఉన్న గోవిందమ్మ చిన్న కొడుకు రాజుతో మాట్లాడుతూ అమ్మకు ధైర్యం చెప్పాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లాలన్నారు. నువ్వేం చదువుతున్నావని కలెక్టర్ రాజును ఆరా తీశారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయ్యానని, ఆర్థిక పరిస్థితి బాగాలేనందున ఉన్నత చదువులు చదువలేకపోయానని, చదువుకోవాలని ఉత్సాహం ఉందని కలెక్టర్‌కు తెలిపారు. 10వ తరగతిలో తప్పిపోయిన పరీక్షను రాసి పాస్ అవ్వాలని, ఇంటర్ చదువుకోవాలని కలెక్టర్ రాజుకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి అందించిన రూ.50 వేలు మానిటరీ రిలీఫ్ ఫండ్ అందించామని, ఆ మొత్తం అకౌంట్‌లో జమ అయిందా అని కలెక్టర్ రాజును అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసుశాఖ బాధిత మహిళ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కళాశాల అభివద్ధికి తోడ్పడుతా

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కళాశాల అభివద్ధికి అన్ని విధాలుగా తోడ్పడతానని రాష్ట్ర పరిసరమల శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. సోమవారం నగరంలోని స్థానిక టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సుకు సంబంధించిన కంప్యూటర్ ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపల్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.సుంకన్న కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డులు అన్నివిభాగాలకు చాలా కీలకం

సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం. మహేష్ కుమార్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు సోమవారం కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ మైదానంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ హోంగార్డు పరేడ్‌ను నిర్వహించి పరిశీలన చేశారు. కమాండెంట్ మాట్లాడుతూ... క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జీవిత బీమాలో పాలసీలు చేసుకోవాలన్నారు. విధుల్లో నైపుణ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలన్నారు. హోంగార్డ్ డిఎస్‌పి కృష్ణమోహన్ , ఆర్ఐ జావేద్ , హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

మొర వినిపించాలని...

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పోటెత్తిన అర్జీదారులు
- భూ సమస్యలే అధికం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యల గోడును వెళ్లబోసుకున్నారు. అర్జీదారుల నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా అర్జీలను స్వీకరించారు. మొత్తం 232 మంది అర్జీదారులు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. వచ్చిన అర్జీల్లో రెవెన్యూకు సంబంధించిన వాటిలో అత్యధికంగా భూ సమస్యలకు చెందినవే ఉన్నాయి. నాన్ రెవెన్యూకు సంబంధించిన వాటిలో కొత్త పింఛన్ల మంజూరు వంటివి ఉన్నాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వారిలో కొందరి సమస్యలు ఇలా..

మా భూమి ఆన్‌లైన్ చేయించండి

నా భర్త పేరు మీద 1.20 ఎకరాల డి పట్టా భూమి ఉంది. గత 25 ఏళ్లుగా ఆ భూమి మా ఆధీనంలోనే ఉంది. దాన్ని ఇప్పటి వరకూ ఆన్‌లైన్ చేయలేదు. దాని కోసం తిరిగి తిరిగి నా భర్త చనిపోయాడు. ఇప్పుడైనా మా భూమి ఆన్‌లైన్ చేయించండి

- లచ్చమ్మ, అనుగొండ, కోడుమూరు మండలం.

అక్రమంగా తొలగించారు

నేను దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయాగా పని చేసే దాన్ని. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా నన్ను అక్రమంగా తొలగించారు. పని చేసిన కాలంలో 23 నెలల జీతం కూడా పెండింగ్ ఉంది. తిరిగి ఉద్యోగం ఇప్పించడంతో పాటు పెండింగ్ ఉన్న జీతాన్ని ఇచ్చేలా చూడాలి.

- మహాదేవి, దేవనకొండ.

వంద శాతం వికలాంగ పింఛన్ ఇవ్వాలి

నా కొడుకు ఎస్ అనిల్ కుమార్ బుద్ధిమాంద్యంతో ఉన్నాడు. వంద శాతం వికలాంగత్వం ఉంది. సదరం సర్టిఫికేట్ కూడా ఉంది. ప్రస్తుతం సాధారణ వికలాంగ పింఛన్ వస్తోంది. వంద శాతం వికలాంగత్వం ఉన్న వారికి అందించే పింఛన్‌ను ఇవ్వాలి. త్వరగా స్పందించాలి.

సువర్ణ, సి.బెళగల్.

పేదల ఆకలి తీర్చేందుకే అన్నక్యాంటీన్లు

అన్నక్యాంటీన్లను ప్రారంభించిన మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని రూ.5 అందిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రివర్యులు టిజి.భరత్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద, స్థానిక పాత బస్టాండ్ వద్ద కొండారెడ్డి బురుజు సమీపంలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లను మంత్రి టిజి. భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. కర్నూలు నియోజకవర్గంలో పేదలకు అవసరమైన ప్రదేశాలలో 3 అన్న క్యాంటీన్ లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 2 అన్న క్యాంటీన్లను సోమవారం ప్రారంభించామని తెలిపారు. త్వరలో స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మరొక అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో ఐదు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వరకు 4 అన్న క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు. అన్న క్యాంటీన్ లను ప్రారంభించిన అనంతరం మంత్రి, కలెక్టర్ స్వయంగా ప్రజలకు అల్పాహారాన్ని వడ్డించడంతో పాటు వారితో కలిసి స్వీకరించారు. కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచి ఆకెపోగు జయన్న

బి.తాండ్రపాడులో వేగంగా రోడ్డు పనులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం బి.తాండ్రపాడులోని మంగళగిరి కాలనీలో సిసి రోడ్డు పనులు శరవేగంగా నిర్వహిస్తున్నామని గ్రామ సర్పంచి ఆకెపోగు జయన్న అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి వేగంగా సాగుతుందన్నారు. సంవత్సరాలుగా కాలనీకి సిసి రోడ్డు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతుండడాన్ని గమనించి పంచాయతీ జనరల్ ఫండ్స్‌నుంచి సుమారు రూ.25 లక్షల అంచనాలతో రోడ్డు నిర్మాణానికి పూనుకున్నామన్నారు. గ్రామంలో కర్నూలు నంద్యాల రోడ్డు నుంచి జి.పుల్లారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల వరకు వేస్తున్నామన్నారు. రోడ్డు 135 మీటర్లు పొడవు, 20 అడుగుల వెడల్పుతో వేస్తున్నామన్నారు. పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సమీనా అంజుమ్ జరుగుతున్న పనులను దగ్గరుండి పర్యవేక్షించారు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కార్మిక రైతు సంఘాల నేతలు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు రైతు సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు, ఎఐటియుసి నగర కార్యదర్శులు సిహెచ్ సాయిబాబా, చంద్రశేఖర్, సిఐటియు జరిగిన కార్యక్రమంలో ఎండి అంజిబాబు, మూనెప్ప, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి నాగన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 2022 సెప్టెంబరు 22న లేబర్ కోడ్‌లను పార్లమెంటు ఆమోదించిందని దానికి నిరసనగా దేశవ్యాప్తంగా బ్లాక్ డే ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాత కార్మిక చట్టాలైన 44 చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకురావడం వల్ల కార్మికులకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్మికులకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇచ్చే అవకాశం లేకుండా పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు అవలంబించే అవకాశం ఉందన్నారు. పారిశ్రామిక చట్టం ప్రకారం కార్మికులు ఐక్యం కావడానికి సంఘం పెట్టుకోవడానికి అవకాశాలు ఉండేవని, నేడు విధించిన షరతులు వల్ల కార్మికుల సంఘాలు పెట్టుకునే అవకాశం లేకుండా చేసే విధంగా కోడ్లు రూపొందిస్తున్నారని విమర్శించారు. వృత్తిపరరక్షణ ఆరోగ్యం , వర్కింగ్ కండిషన్ల కోడ్ ప్రకారం అన్ని రకాల కార్మికులను ఒకే రకమైన వర్కింగ్ కండిషన్ల కిందకి తీసుకురావడం వల్ల కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి పాత కార్మిక చట్టాలనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు గోపాల్, నాగేశ్వరరావు ఓల్డ్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, న్యూ సిటీ అధ్యక్షులు నరసింహులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుధాకరప్ప, ఏసు ఆటో వర్కర్ సీనియర్ నాయకులు మహమూద్ ,కుమార్, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు మహమ్మద్ రఫీ, ఎఐటియుసి నగర నాయకులు రామాంజనేయులు, ఆటో వర్కర్ సీనియర్ నాయకులు ఈశ్వర్, అబ్బాస్, వెంకట్రాముడు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రహిమాన్, నల్లప్ప, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎండి.అంజిబాబు

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

- వ్యకాస, ఎఐటియుసి నాయకులు

నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి -దేవనకొండ

కార్మిక వర్గ శ్రేయస్సుకు ఆటంకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, డాక్టర్ స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.నరసారావు డిమాండ్ చేశారు. సోమవారం దేవనకొండ గాంధీ విగ్రహం ఎదుట ఉమ్మడి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు మండల కార్యదర్శి అశోక్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా చేయడం దారుణమని విమర్శించారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు హయ్యర్ పెన్షన్ విధానాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు యూసుఫ్, కృష్ణ, భాస్కర్, వీరాంజనేయులు, రామాంజి, శ్రీనివాసులు, మద్దిలేటి, నాగేంద్ర పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత

- కమిషనర్ కృష్ణ


కమిషనర్‌ను కలిసిన దేవిశెట్టి ప్రకాష్

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పట్టణంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదోని కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. సోమవారం కమిషనర్ కృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను గతంలో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేసినట్లు తెలిపారు. ఆదోని పట్టణ ప్రజలు తమకు అన్ని రకాలుగా సహకరించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను, నిబంధనలను విధిగా అమలు చేయాలని సూచించారు. అనంతరం కమిషనర్‌కు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యాలయంలోని ఇతర అధికారులు, సిబ్బంది కమిషనర్‌ను కలిశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ కమిషనర్‌ను కలిసి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

గోనెగండ్లలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

- ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రారంభం

- రూ.20 లక్షలతో సిసి రోడ్డుకు భూమిపూజ

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.నాగేశ్వరరెడ్డి సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా చింతలముని నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం బీసీ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. ఎస్సీ కాలనీలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'లో పాల్గొన్నారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, ఎన్‌వి.రామాంజినేయులు, బేతాళ బడేసా, తిరుపతయ్య నాయుడు, ఎస్.షేక్షావలీ, రంగస్వామి నాయుడు, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మదీనా, గౌవుండా రహమతుల్లా, రాంపురం లాలు, నూర్ అహ్మద్, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, సెపక్ తక్రా పోటీలకు మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య తెలిపారు. సోమవారం ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ ఫుట్‌బాల్, సెపక్‌తక్రా పోటీల్లో రాణించి 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఫుట్ బాల్ విభాగం నుంచి లలిత, ముస్కాన్, పద్మశ్రీ, వరుణ్ గౌడ్, అండర్-17 ఫుట్‌బాల్ విభాగం నుంచి అనిత, ఇమ్రాన్, అండర్-14 సెపక్‌తక్రా విభాగం నుంచి రామనాయుడు, అండర్-17 సెపక్‌తక్రా విభాగం నుంచి మేబూనా, మురళీ ఎంపికయ్యారని చెప్పారు. నాగభూషణం, రామన్న, చంద్రశేఖర్, గోపాల్, సుభాషిని, పుష్పలత, సంధ్యారాణి పాల్గొన్నారు.

భూసర్వేలో భారీ దందా..!

-రైతులను దోపిడీ చేసిన సర్వేయర్లు
-మండల సర్వేయర్ ఆదేశాలతోనే జోరుగా వసూలు
-కలకలం రేపిన ఆడియో లీక్

ప్రజాశక్తి - హొళగుంద

గత ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే సర్వేయర్లకు కల్పతరువుగా మారింది. భూసర్వేలో భూమి విస్తీర్ణం సరిగ్గా లేదంటూ సర్వేయర్లు రైతుల నుంచి లక్షలాది రూపాయలు ముక్కు పిండి వసూలు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. భూమి విస్తీర్ణంలో తేడాలను సరి చేయాలంటే ఎకరాకు ఓ రేటు నిర్ణయించి దోపిడీకి పాల్పడినట్లు తెలిసింది.

హొళగుంద మండలం ముద్దతమాగి, మునసుగుంది, నాగర కన్వి, వన్నూరు, మడ్డి లింగదహళ్లి (ఎమ్‌డి.హళ్లి), పెద్దగోనెహాల్‌లో భూ సర్వే పూర్తి కాగా గజ్జహల్లి, మార్లమడికి గ్రామాల్లో వెరిఫికేషన్‌లో ఆగిపోయింది. ఈ గ్రామాల్లో దాదాపు 30 నుంచి రూ.50 లక్షల వరకు సర్వేయర్లు దండుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామానికి ఓ దళారి

మండలంలో భూసర్వే జరిగిన గ్రామాల్లో సర్వేయర్లు దళారులను ఏర్పాటు చేసుకొని అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. గ్రామాల్లో భూ సర్వే జరిగిన సమయంలో భూమి విస్తీర్ణంలో తేడాలు వచ్చాయని రైతులు ఆందోళనకు గురయ్యారు. రైతుల ఆందోళనను ఆసరాగా చేసుకుని సర్వేయర్లు దళారులను ఉసిగొలిపి రైతులతో మాట్లాడించి 'నీ భూమి రికార్డుల్లో సక్రమంగా ఉండేలా చూస్తామ'ని భరోసా ఇస్తూ నిలువు దోపిడీకి పాల్పడ్డారు.

మండల సర్వేయర్ ఆదేశాల మేరకే

సర్వేయర్ ఆదేశాల మేరకే గ్రామస్థాయి సర్వేయర్లు భారీ దందాకు పాల్పడినట్లు తెలిసింది. మండల సర్వేయర్ గ్రామాల్లో జరిగిన భూ సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండా అవినీతికి పాల్పడ్డారంటూ మండల రైతులు విమర్శిస్తున్నారు. మండల సర్వేయర్ రోజువారీగా వచ్చే విధుల పట్ల అలసత్వంగా వ్యవహరిస్తున్నారని రైతులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మండల సర్వేయర్ ఎక్కడైనా సర్వే చేయడానికి వెళితే రైతుల మధ్య భూతగాదాలను పరిష్కరించకుండా నాన్చుడు ధోరణి వ్యవహరిస్తూ రైతుల మధ్య ఘర్షణ తలెత్తేలా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

భూ సర్వే లో భారీ దందా

గ్రామాల్లో జరిగిన భూసర్వేలో భారీ దందాలో మండల సర్వేయర్‌కు అధిక వాటా అందినట్లు సమాచారం. ఈయన మౌనంగా ఉంటూ మంచి వ్యక్తిలా వ్యవహరిస్తూ రైతులను దోచుకోవడంలో 'ఈయనకే ఈయన సాటి' అని రైతులు విమర్శిస్తున్నారు. రైతులు ప్రశ్నిస్తే 'నన్ను ఇక్కడి నుంచి బదిలీ చేయించండి. నేనెవరికీ భయపడను. నేను ఇంతే' అని ఘాటుగా సమాధానం ఇవ్వడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని పేర్కొంటున్నారు.

ఆడియో లీక్ కలకలం

భూసర్వే సమయంలో గజ్జహల్లి గ్రామ సర్వేయర్‌తో ఓ దళారి మాట్లాడిన ఆడియో బయటికి రావడంతో ఇంత పెద్ద భూదందా జరిగిందా అంటూ మండలంలో కలకలం రేపింది. ఆడియోలో దళారి గ్రామానికి సంబంధించి 'ఇతరుల భూమి విషయంలో ఎంత తీసుకుంటారో మీ ఇష్టం. ఇప్పించే బాధ్యత నాది. కానీ నా భూమి విషయంలో చూసుకొని మాట్లాడాల'ని కోరారు. ఈ ఆడియో ప్రస్తుతం మండలంలో సంచలనంగా మారింది. భూ సర్వేలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి.

ఆలూరులో చికిత్స పొందుతున్న తిరుమలమ్మ

పోలీసు స్టేషన్ ముందు మహిళ ఆత్మహత్యాయత్నం

- ఆలూరు ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులోని పోలీసు స్టేషన్ ముందు సోమవారం మధ్యాహ్నం తిరుమలమ్మ అనే మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బంధువులు, పోలీసులు గమనించి ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బంధువుల వివరాల మేరకు... అరికెర గ్రామానికి చెందిన తిరుమలమ్మ మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన పాండురంగను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. గత కొన్ని రోజుల నుంచి భర్త పాండురంగ రోజూ తాగి వస్తున్నారని తిరుమలమ్మ భర్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లారు. భార్య ఇంటికి రావడం లేదని ఆరు నెలల క్రితం పాండురంగ మద్యం తాగి భార్య ఇంటికి వెళ్లారు. ఇంటి మిద్దె పైనుంచి జారి పడి మృతి చెందారు. 'మీరంతా కలిసి మిద్దెపై నుంచి తోసి చంపార'ని భర్త కుటుంబ సభ్యులు తిరుమలమ్మ కుటుంబ సభ్యులపై కేసు పెట్టారు. అప్పటి నుంచి ఉన్న ఒక్కగానొక్క కుమారుని తల్లి నుంచి దూరం చేసి తీసుకెళ్లారు. తన కుమారుని తనకు ఇప్పించాలని తిరుమలమ్మ పోలీసులను, అధికారులను కోరినా పట్టించుకోలేదని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కుమారుని తల్లి చెంతకు చేర్చాలని ఎస్పీ తెలిపినా పోలీసులు పట్టించుకోవడం లేదని స్టేషన్ ముందు పురుగు మందు తాగారు. కుమారుని కన్న తల్లి చెంతకు చేర్చాలని తిరుమలమ్మ కుటింబ సభ్యులు కోరుతున్నారు.

25న చెకుముకి పోటీలు : జెవివి

కరపత్రాలను అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 25న జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి సైన్స్ సంబరాలు చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. సోమవారం జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య, నాయకులు బిజి.మాదన్న, ఖాదర్ బాషలు వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలను సందర్శించి 8, 9, 10వ తరగతి విద్యార్థులను చెకుముకి పోటీల్లో పాల్గొనేటట్లు ప్రోత్సహించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లకు కరపత్రాలను అందజేశారు. పాఠశాలల్లో నేటి విద్యార్థులను పరిశీలన, ప్రయోగాల ద్వారా భవిష్యత్తు సమాజాలు ఎదుర్కొనే సమస్యలను సృజన శీలంగా పరిష్కరించే పౌరులుగా తీర్చిదిద్దాలని నాయకులు కోరారు.

మద్యం తరలింపుపై తగాద

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని కందుకూరు గ్రామస్తులు, కౌతాళం మండలం తిప్పాలదొడ్డి గ్రామస్తులు మద్యం తరలింపు కోసం కర్రలతో కొట్టుకుని తగాద పడ్డారు. సోమవారం తిప్పాలదొడ్డి గ్రామస్తులు హనుమేష్, మల్లయ్య, అళ్లయ్య, సురేష్‌లు కందుకూరు గ్రామస్తులు రాముడు, భీమేష్, శివ, రాజు, చిన్న రాముడు కళ్లలో కారం చల్లి కర్రలతో దాడి చేసినట్లు కందుకూరు గ్రామస్తులతో పాటు బాధితులు కోసిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల వివరాల మేరకు... కందుకూరు గ్రామ సమీపంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయం దగ్గర కర్ణాటక నుంచి ఆంధ్రాకు మద్యం తరలింపు విషయంలో గొడవ పడినట్లు తెలిపారు. ఏమైనా ఉంటే కూర్చొని మాట్లాడాలి తప్ప ఇలా దాడి చేయడం మంచి పద్ధతి కాదని గ్రామ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిప్పాలదొడ్డి గ్రామస్తులు మాట్లాడుతూ... తాము గ్రామానికి గొడవకు వెళ్లలేదని, మాట్లాడడానికి వెళ్లామని, అక్కడ మాటామాట పెరిగి ఇరు గ్రూపులకు గొడవ జరిగిన మాట వాస్తవమేనని తెలిపారు. ఈ దాడిలో తమకూ గాయాలయ్యాయన్నారు. ఇరు గ్రూపులను పిలిపించి విచారణ చేసి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

గాయాలైన కందుకూరు గ్రామస్తులు

ప్రజల ఆకాంక్షను నెరవేర్చడమే లక్ష్యం

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. సోమవారం మండలంలోని ముత్తుకూరు గ్రామ పంచాయతీ ఆవరణంలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. ప్రజా సంక్షేమ పాలనకు వందరోజులని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. తహశీల్దార్ శివశంకర్ నాయక్, ఎంపిడిఒ రాణెమ్మ, టిడిపి మండల కన్వీనర్ పరమా రెడ్డి, మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు, సర్పంచి తోయజాక్షప్ప, మాజీ సర్పంచి కృష్ణారెడ్డి, మాజీ డైరెక్టర్ కృష్ణ యాదవ్, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, నాయకులు నర్సిరెడ్డి, గోవిందు, హరి, సతీష్ కుమార్, జనసేన మండల కన్వీనర్ అరవింద్, బిజెపి నాయకులు రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి జంప్లా నాయక్, విఆర్ఒ హరికృష్ణ పాల్గొన్నారు. **ఆదోని**లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో 'ఇది మంచి ప్రభుత్వం' మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ ఛైర్మన్ శాంత హాజరయ్యారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుడిసె ఆది కృష్ణమ్మ, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శి బుద్ధారెడ్డి, బిజెపి నాయకులు నాగరాజ్ గౌడ్, జనసేన నాయకులు రేణు వర్మ, జనసేన వీర మహిళ రాజేశ్వరి, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, మారుతి, ఓంకార్, చిట్టిరాజు, శ్రీనివాస్ ఆచారి, రాఘవరెడ్డి, భరత్, వీరేష్, చిరంజీవి, అమర్, బాబురావు, అల్తాఫ్, దేవేంద్ర, సిరాజ్, కృష్ణారెడ్డి ఉన్నారు. **ఆదోని (రూరల్)** మండలం ఇస్వీ, జాలమంచి గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు హాజరయ్యారు. జాలమంచి సర్పంచి తిక్కమ్మ, టిడిపి సీనియర్ నాయకులు గోవిందు, బంగారయ్య, అయ్యన్న, మబ్బుంబాష, హానవాల్ బాష, రామస్వామి, మురళీ పాల్గొన్నారు. **కౌతాళం** మండలం కుంభాలనూరు, ఎరిగేరి, కుంటనహాల్ గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య, నాయకులు సతీష్ నాయుడు, పట్టాభి, భాస్కర్, నాగేశ్వరరావు, త్రిమూర్తులు, మహాదేవ, రామలింగ, గోవిందు పాల్గొన్నారు. **హొళగుంద** మండలం హెబ్బటం గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ఆదేశాల మేరకు సర్పంచి కృష్ణవేణి, ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి వివరించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు ఈరన్న, పకీరప్ప, లక్ష్మయ్య, వన్నూరప్ప, శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలం బసలదొడ్డి, చిన్నతుంబలం, మేకడోన గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, చిన్నతుంబలం వీరేష్ గౌడ్, అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిపై వివరించారు. పంచాయతీ కార్యదర్శి రవి, విఆర్ఒ సురేష్, లైబ్రేరియన్ ఆశాజ్యోతి, మేకడోన నాయకులు హజరత్ వలీ, నరసప్ప, బాలరాజు, సత్తి, వన్నప్ప, చిన్నతుంబలం టిడిపి నాయకులు డీలర్ నరసింహులు, నరసప్ప, చంద్ర, మహాదేవ, హనుమంతు, మాల శివ, నాగప్ప, నారాయణ, తిక్కయ్య, కురువ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్‌గా అంగన్వాడీ సూపర్‌వైజర్ వీర గోవిందమ్మ పాల్గొన్నారు.

ఆస్పరిలో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

ఆదోనిలో...

ఆదోనిలో మాట్లాడుతున్న మబ్బుంబాష

కౌతాళంలో...

పెద్దకడబూరులో...

ఉరుకుంద పాఠశాలకు బంగారు పతకాల పంట

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉరుకుంద ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు ఈరన్న తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో ఆరుగురు విద్యార్థులు బంగారు పతకం, ఇటీవలే మండల స్థాయిలో జరిగిన పోటీల్లో మూడు వెండి పతకాలు, ఆరు కాంస్య పథకాలు సాధించినట్లు తెలిపారు.

'లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఎఐటియుసి, ఎఐకెఎస్ నాయకులు కోరారు. సోమవారం సోమప్ప సర్కిల్‌లో 'బ్లాక్ డే' చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపనగౌడ్, ఎఐటియుసి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు మాట్లాడారు. ఎఐటియుసి, రైతుసంఘం నాయకులు చిన్నన్న, దాదావలీ, శాంతప్ప, నరసింహారెడ్డి, ఎల్లప్ప, ఖాజా, మల్లికార్జున గౌడ్, రవి, నాగరాజ్, హనుమంతు, వీరాంజిగౌడ్, కిరణ్ కుమార్, భీమేష్, రామకృష్ణ, నారాయణ, అల్లాబకాష్, నరసింహులు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం : సిఐ

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక రాష్ట్రానికి చెందిన 51 బాక్సుల్లో ఉన్న 4608 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రామలింగయ్య తెలిపారు. సోమవారం త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని రాంజల రోడ్డులో ఒక ఇంట్లో నిల్వ చేస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సంఘటనలో ముగ్గురు నిందితులను గుర్తించగా, ఇద్దరు పరారీ అయ్యారని చెప్పారు. సయ్యద్ నూర్‌ను అరెస్టు చేశామని, త్వరలోనే పరారీలో ఉన్న సయ్యద్ చాంద్‌ను, బోయ చంద్రను అరెస్టు చేస్తామని తెలిపారు. దాడి చేసి పట్టుకున్న పోలీసు సిబ్బందిని అభినందించారు. **హొళగుంద** గ్రామానికి చెందిన బకాడి గంగాధర్ కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు. గ్రామ ఊరు బయట ఉన్న నీళ్ల ట్యాంకు వద్ద అతనిని పట్టుకొని అతని వద్ద నుంచి 96 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంగాధర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ కోసం ఆలూరు కోర్టు ముందు హాజరు పరిచినట్లు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకే గ్రామ సభలు

- టిడిపి నాయకులు అశోక్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రతి గ్రామంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే గ్రామసభల లక్ష్యమని టిడిపి నాయకులు అశోక్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మంచాల పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపిడిఒ మణిమంజరి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో స్వచ్ఛత తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్లు, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు వంటివి అత్యవసరమైన మౌలిక వసతులని తెలిపారు. అధికారులు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని కోరారు. అనంతరం రామచంద్ర నగర్ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, ఎంపిటిసి నక్కి వెంకటేష్, విద్యా కమిటీ ఛైర్మన్ మద్రి నరసింహ, నాయకులు డిసి.తిమ్మప్ప, శివ, డేవిడ్, జనసేన నాయకులు బిబిసి చిన్న, ఇఒఆర్‌డి ప్రభావతి, కార్యనిర్వహణ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

కేసు ఛేదనలో పోలీసుల అలసత్వం

- చోరీకి పాల్పడిన పోలీసులెవరు..?

- వరుస దొంగతనాలకు అడ్డుకట్ట ఏది..?

ప్రజాశక్తి - ఆలూరు

ఈనెల 17న పోలీసులు రైతు నుంచి రూ.26 వేల చోరీకి పాల్పడిన కేసు ఛేదనలో పోలీసులు అలసత్వం వహిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి.... ఆలూరు మండలం మనేకుర్తి గ్రామానికి చెందిన నడిపి అంజినయ్య అలియాస్ కిళ్లప్ప రాత్రి ఆలూరు పట్టణ శివారులోని పెట్రోల్ బంకులో క్యాన్‌లో డీజిల్ నింపుకున్నారు. తిరిగి తన బైక్‌పై ఊరికి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన పోలీసులు రైతును అడ్డగించి రూ.26 వేలు తస్కరించి పరారయ్యారు. అదే రోజు రైతు నడిపి అంజినయ్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదు. ప్రజాశక్తి పత్రికలో 'పోలీసులా.. మజాకా' అన్న శీర్షికన వచ్చిన వార్తకు స్పందించి పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదయి మూడు రోజులైనప్పటికీ పోలీసు అధికారులు ఎక్కడా విచారణ చేసిన దాఖలాలు కనిపించడం లేదు. పోలీసులు కాకుండా దొంగలు చోరీకి పాల్పడితే రైతు వద్ద ఉన్న మొత్తం డబ్బును దోచుకెళ్లే వారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కేసు నుంచి పోలీసులను తప్పించేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

వరుస దొంగతనాలకు అడ్డుకట్ట ఏది..?

రైతు నుంచి చోరీకి పాల్పడిన రెండు రోజులకు 19న హత్తిబెళగల్ గ్రామంలోని జగనన్న కాలనీలో కురువ రామలక్ష్మి ఇంట్లో 9 తులాల బంగారు, 25 తులాల వెండి దొంగలించారు. ఆగస్టు 29న పెద్ద హోతూరు గ్రామంలోని మాల తిక్కన్న ఇంట్లో 4 తులాల బంగారు, 50 తులాల వెండి, రూ.60 వేలు నగదును దొంగలించారు. రెండు నెలల క్రితం ఆలూరు పట్టణంలోని మెయిన్ బజార్‌లో 6 ఇళ్లలో ఒకేరోజు దొంగతనం జరిగింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో వరుస దొంగతనాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు రైతును మోసం చేసిన పోలీసులు ఎవరనేది తేల్చి ప్రజా రక్షణకు భరోసా ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్లు

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో రహదారుల దిగ్బంధం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలు వయా కోడుమూరు వయా గూడూరు, కోసిగి పలు ప్రాంతాల మీదుగా వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖాసీం వలీ, ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మదర్ థెరిస్సా బిఇడి కళాశాల ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డును దిగ్బంధించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో మండల, గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతల మయంగా మారాయని తెలిపారు. పరిస్థితి అధ్వానంగా మారడంతో ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు పట్టించుకోకపోవడంతో దారుణమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు రోడ్ల దుస్థితిపై దృష్టి సారించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ యువ నాయకులు దాదా కలందర్, బనవాసి జయపాల్, నిస్సార్, సోమేష్, అక్బర్, మహబూబ్, కుష్ఠ, సయ్యద్, కుమార్, అజయ్, ఆసిన్, బడే సాబ్, విజయ్ పాల్గొన్నారు.

వరద కాలువ లేదా రైట్ కెనాల్ నిర్మించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదిపై వరద కాలువ లేదా రైట్ కెనాల్ నిర్మించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. సోమవారం తహశీల్దార్ మల్లికార్జున స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు పండక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఎల్ఎల్‌సి, తుంగభద్ర నది ప్రవహిస్తున్న సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. పశ్చిమ ప్రాంత వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం రైట్ కెనాల్ నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో కరువు, వలసల నివారణకు మండల రాజకీయ నాయకులు, అధికారులు ప్రయత్నం చేయడం లేదన్నారు. రైతుసంఘం మండల కార్యదర్శి బి.ఈరన్న, ఉలిగయ్య, రామలింగ, వీరేష్, అయ్యప్ప పాల్గొన్నారు.

ఆరెకటికెలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆరెకటికెలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆరెకటికె అభివృద్ధి సంఘం నాయకులు కె.వీర ప్రసాదరావు, ఎమ్‌కె.గిడ్డోజి రావు, ఎ.నాగేశ్వరరావు కోరారు. సోమవారం ఆరెకటికె అభివృద్ధి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆరెకటికెలు విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని తెలిపారు. చౌడోజీ రావు, శ్రీనివాసులు, రాఘవేంద్రరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

ఆరెకటికె అభివృద్ధి సంఘం అధ్యక్షులుగా కె.వీరప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా ఎ.రాఘవేంద్ర రావు, కార్యదర్శిగా ఎమ్‌కె.గిడ్డోజీరావు, సహాయ కార్యదర్శిగా కెఎం.కృష్ణారావు, ఆర్థిక కార్యదర్శిగా ఎ.నాగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా కె.వీరేష్ రావు, కె.కాశీజీ ఎన్నికయ్యారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- ప్రిన్సిపల్ సంజన్న

ప్రజాశక్తి - ఆదోని

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరవని, క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సంజన్న తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాలలోని ద్వితీయ సంవత్సరం విద్యార్థుల చేత స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ సంజన్న, కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.గోవిందరాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధుల వ్యాప్తికి దోహద పడతాయని తెలిపారు. జంతు శాస్త్ర అధ్యాపకులు జిబి.వేదవతి, వ్యాయామ అధ్యాపకులు కె.చిట్టి ప్రసాద్, సూరిబాబు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ 5 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు మరియు మోటర్ ఆక్సిడెంట్ క్లెయిమ్ ట్రిబ్యునల్ కోర్టులో
M. V. O. P. No. 16/2024
1) కాశినేని తిరుపాలు,
S/o. కాశినేని సంజన్న, వయస్సు 53 సంll,
2) బేతం లక్ష్మీదేవి,
D/o. కాశినేని సంజన్న, వయస్సు 46 సంll,
3) కాశినేని సంజీవరాయుడు,
S/o కాశినేని సంజన్న, వయస్సు 41 సంll,
4) మిద్దె సంజమ్మ, D/o. కాశినేని సంజన్న, వయస్సు 35 సంll,
అందరూ హిందువులు, వ్యవసాయదారులు,
R/o. H. No.1-10, నాగళ్ళపాడు గ్రామం చాగలమర్రి మండలం, నంద్యాల జిల్లా. ...పిటిషనర్స్
V.S
1) వేముల భారతి, W/o. వేముల శేఖర్,
డోర్ నెం. 1-27, వయస్సు 33 సంll, R/o. కైతూరు గ్రామం, అలంపూర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా.
మారుతి సుజుకి కారు యొక్క ఓనరు
(మారుతి సుజుకి D - zire)
కారు నెం. TS 33 - B -1236
2) వేముల శేఖర్, S/o. చిన్న మద్దిలేటి,
డోర్ నెం. 1-27, వయస్సు 32 సం,
R/o. కైతూరు గ్రామం, అలంపూర్ మండలం,
మహబూబునగర్ జిల్లా. ...1,3 వ రెస్పాండెంట్స్
1, 3 వ రెస్పాండెంటు కు M.V. O. P నోటీస్
పిటిషనర్స్, రెస్పాండెంట్స్ అయిన మీపై కేశినేని సుంకమ్మ చనిపోయినందున వారి వారసులు M.V. O. P పిటిషన్ దాఖలు చేసి ఉన్నందున సదరు పిటిషన్ లో మీ యొక్క హాజరు నిమిత్తం 22-10-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయంగా కాని, మీ వకీలు ద్వారా కాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల నీకు పరోక్షంగా M.V.O.P పిటిషన్ తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 22-10-2024
కె. సాయి స్వరూప్,
కె. వెంకటేశ్వర్లు,
పిటిషనర్స్ తరపు అడ్వకేట్స్, ఆళ్లగడ్డ.

తిరుమల లడ్డుపై దుష్ప్రచారం తగదు

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

తిరుమల లడ్డుపై ముఖ్యమంత్రి చంద్రబాబు దుష్ప్రచారం చేయడం తగదని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి విమర్శించారు. సోమవారం చిప్పగిరిలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోసపూరిత రాజకీయాల కోసం ముఖ్యమంత్రి టిటిడి ప్రతిష్టను దిగజారిచేలా, తిరుమల ప్రసాదంపై అనుమానాలను పెంచేలా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఈ రకంగా మాట్లాడితే ప్రజల్లో లేనిపోని అపోహలు నెలకొంటాయని తెలిపారు. నిజానిజాలు నిగ్గు తేల్చాలని తమ నాయకులు జగన్మోహన్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో టిడిపి ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే లడ్డు తయారీలో నెయ్యి బదులు జంతువుల కొవ్వును వాడారని దుష్ప్రచారంతో ప్రజల మనోభావాలను రెచ్చగొడుతున్నారన్నారు. టిటిడిలో నాణ్యతను తనిఖీ చేసేందుకు పకడ్బందీ వ్యవస్థ ఉందని తెలిపారు. నెయ్యి నాణ్యత లేకపోవడంతో వెనుకకు పంపించిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. గత టిడిపి పరిపాలనలో 15 సార్లు, జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో 18 సార్లు నాణ్యత లేకపోవడంతో వెనక్కు పంపించినట్లు తెలిపారు. సిబిఐతో కానీ, సుప్రీంకోర్టు జడ్జితో కానీ విచారణ చేయించాలని కోరారు. వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సొసైటీ మాజీ అధ్యక్షులు ఉనేబాద్ మల్లికార్జున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి, నాయకులు

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న శారద శిల్పకళా మందిరం ఆవరణంలో దురుగడ్డ రవీంద్ర చారి, సావిత్రమ్మ దంపతుల ఆధ్వర్యంలో డాక్టర్ వెంకట సుబ్బారెడ్డి ఆసుపత్రి వారి సౌజన్యంతో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ లక్ష్మారెడ్డి, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ చంద్రిక, డయాబెటిక్ స్పెషలిస్ట్ డాక్టర్ యశ్వంత్ రెడ్డి, జూనియర్ డాక్టర్లు దాదాపు 500 మందికి పైగా శిల్ప కళాకారులకు, స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ మహిళా శిల్పి భువనేశ్వరి, వడ్ల సుబ్బయ్య ఆచారి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాష అభివృద్ధికి కృషి : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల : ఉర్దూ భాష అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. జొయ ఉర్దూ కోచింగ్ డైరెక్టర్ సి అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్, మైనారిటీ సంక్షేమ శాఖ ప్రచురితమైన టెట్ - 2024 ఉర్దూ మెటీరియల్‌నుఉర్దూ మాధ్యమం విద్యార్థులకు సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అయమ్మ, ఉల్మా అధ్యక్షుడు హఫీజ్ అంజద్ బాషా సిద్దీఖి, జమాత్-ఈ-ఇస్లామి హింద్ అధ్యక్షుడు అబ్దుల్ సమద్ ఉర్దూ డిఐ. హస్మొద్దీన్, కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సి. అబ్దుల్ సత్తార్, ఎపి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ సి. అబ్దుల్ అజీజ్, జిల్లా అధ్యక్షులు షమీమ్ బాను, ప్రధాన కార్యదర్శి అంజద్ షరీఫ్, సిఆర్‌పి. వకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి

ప్రజాశక్తి - రుద్రవరం : ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని రుద్రవరం అటవీ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ డైరెక్టర్ టైగర్ ప్రాజెక్ట్ ఐఎఫ్ఎస్ అనురాగ్ మీనా ఆదేశాల మేరకు సోమవారం రుద్రవరం రేంజ్ కార్యాలయ పరిసరాలలో ప్లాస్టిక్, వ్యర్ధ పదార్థాలను తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్ ముర్తుజావలి, రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత బ్రాండ్ నిర్మించుకోవాలి

ప్రజాశక్తి - పాణ్యం : విద్యార్థులు తమ సొంత నైపుణ్యంతో వ్యక్తిగత బ్రాండ్ నిర్మించుకోవాలని ఇంట్రోబోట్ ఏఐ టెక్ లీడ్ వసంత శ్రీవాత్స అన్నారు. ఆర్‌జియం ఇంజనీరింగ్ కళాశాలలో నెక్సస్ స్వర్మ్, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం బిల్డింగ్ ఏ పర్సనల్ బ్రాండ్ యాజ్ ఏ డెవలపర్ అన్న అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పుస్తకాల ద్వారానే గాకుండా పలు అంశాలపై ఉన్న అధ్యయనాల ద్వారా సొంత ఏర్పాట్లతో ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వెబ్ డెవలప్ ఎలా పెంపొందించుకోవాలి, సాంకేతికతను ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. సొంత బ్రాండ్లు తయారు చేసేలా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నిక్సాస్ స్వరము వ్యవస్థాపకులు దీపక్ శ్రీరామ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ కుమార్, హెచ్ఓడి భాస్కరరావు, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యం : మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : పట్టణ స్వచ్ఛత, అభివృద్ధే లక్ష్యమని మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జై కిసాన్ పార్క్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవా'ను మున్సిపల్ కమిషనర్ బేబి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్మన్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంబాబు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భరత్ కుమార్, డాక్టర్ సాయి సుధ, డాక్టర్ స్వేత, డాక్టర్ దినేష్, భువనేశ్వరి, కౌన్సిలర్లు అబ్దుల్ హమీద్, ఉస్మాన్ బేగ్, లాలు ప్రసాద్, చాంద్ బాష, అబ్దుల్ రవూఫ్, వి.ఆర్ శ్రీను, కురువ శ్రీను, డి.రమేష్‌లు, ఏ.ఎన్.యంలు, మున్సిపల్ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న కమిషనర్ బేబి

విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

-కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు, కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జి.బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్‌పి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 133 ఫిర్యాదులు వచ్చాయి. చట్టపరిధిలో పరిశీలించి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎస్‌పి జి. బిందు మాధవ్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ మల్లికార్జున రావు, సిఐ శివశంకర్ పాల్గొన్నారు.

వడ్లోని వంక ఆక్రమదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న జి.రామకృష్ణ

కల్లూరు మండలం పెదపాడు గ్రామంలోని ఒడ్లోని వంకను ఆక్రమించుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డిని జి.రామకృష్ణతో పాటు కల్లూరు మండల కార్యదర్శి కె.మధు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపాడు లోని ఓడ్లోని వంకను ఆక్రమించుకోవడం వలన దళితవాడ సుమారు 130 ఇల్లలోకి నీళ్లు ప్రవేశించి తడిసి ముద్దవుతున్నా రన్నారు. ప్రభుత్వ భూమి అయినా వంక భూమిని రియల్ ఎస్టేట్ వారు తమ స్వలాభం కోసం ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. ఆక్రమణకు గురయిన వడ్లోని వంకను యధావిధిగా ఉంచాలని సిపిఎం అనేక రూపాలలో ఆందోళన చేసిన ఇప్పటివరకు యధావిధిగా ఉంచకపోవడం అధికారుల వైఫల్యానికి నిదర్శనం అన్నారు . నెల రోజుల క్రితం ప్రస్తుత కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఇని తక్షణమే సర్వే చేసి రిపోర్టు అందజేయాలని ఆదేశించారన్నారు. అందులో భాగంగానే ఇరిగేషన్ కార్యాలయ జెఇ నాగరాజు సదరు వడ్లోని వంకను పరిశీలన చేసి తహశీల్దార్‌కు నివేదిక పంపినట్లు వారు తెలిపారు. నివేదిక ఇచ్చి సుమారుగా 20 రోజులు కావస్తున్నా స్థానిక అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి శేషిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు వారు తెలిపారు.

రేష్మను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దేశం గర్వపడే విధంగా అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ సీనియర్ విభాగంలో నాలుగు పతకాలు సాధించిన కర్నూలు జిల్లా క్రీడాకారిణి రేష్మను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష సోమవారం అభినందించారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లాకళ్యాణి, డిఎస్‌డిఒ భూపతి రావు, పవర్ లిఫ్టింగ్ శిక్షకుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్ సెపక్ తక్రాలో భారత జట్టుకు కాంస్య పతకం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

చైనా దేశంలోని కింగ్‌డావోలో ఈ నెల 18 నుంచి 23 వరకు జరిగిన ఆసియా బీచ్‌సెపక్ తక్రాలో భారత పురుషుల జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకుంది. వరుసగా ప్రత్యర్థ దేశాల జట్లపై విజయాలు సాధిస్తూ సెమీఫైనల్స్‌లో జరిగిన పోటీలో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఇందులోమనకర్నూలు జిల్లాకు చెందిన కురువ మధు భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి భారత జట్టు విజయంలో ప్రధాన భూమిక పోషించారు. ఆలూరుకు చెందిన మధు గతంలో అనేక రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత జట్టు ఎంపిక పోటీలు చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించి జట్టులో స్థానం సంపాదించారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ పేర్కొన్నారు. సోమవారం కర్నూలు 15వ వార్డు బుధవారపేట మారెమ్మగుడి సమీపంలోని సచివాలయంవద్ద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో మంత్రి టిజి.భరత్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, హామీలను అమలు చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో అద్భుతమైన విజయాలు సాధించిందన్నారు. గతంలో ఈ వార్డు పర్యటన చేసినప్పుడు హంద్రీ ప్రక్కన ఉన్న గృహాలకు పొజిషన్ సర్టిఫికెట్స్ కావాలని ఈ వార్డు ప్రజలు తన దృష్టికి తెచ్చారని.. వాటిని త్వరలో అందజేస్తామని మంత్రి తెలిపారు. వార్డు పర్యటనలో కొంత మంది మాకు పింఛన్లను తొలగించారని, తన దృష్టికి తెచ్చామన్నారను. వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి మంత్రి ఆదేశించారు. ప్రతి నెల ఒకటో తారీఖున అర్హులకు పెన్షన్ అందజేస్తున్నామని, ఒకటో తారీఖున ప్రభుత్వ సెలవు ఉంటే ముందు రోజే పెన్షన్ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సహకారం అందించిందన్నారు. వరదల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించి ప్రజలకు సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకున్నారని మంత్రి అన్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల మంచి కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిందని, ఈ 100 రోజుల్లో పింఛన్లను పెంచి ప్రతి నెల 1వ తేదీ నాడే అందజేస్తుందని, మెగా డిఎస్‌సి ద్వారా 16,347 మంది ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడానికి సిద్ధమైందన్నారు. ఈ వార్డులో కొంతమంది ప్రజలు పారిశుధ్య పనులను ఇంకా మెరుగుపరచాలని, వార్డులోని విద్యుత్ వైర్లు చాలా కిందికి వేలాడుతున్నాయని, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయించాలని, అప్రోచ్డ్ రోడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారన్నారు. వాటన్నిటికీ అంచనాలు తయారు చేస్తున్నామని, త్వరలో వాటిని ఏర్పాటు చేస్తామని కమిషనర్ ప్రజలకు తెలిపారు. కార్పొరేటర్లు శివమ్మ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, సోమిశెట్టి నవీన్, నాయకులు పామన్న, అబ్బాస్, రామాంజనేయులు, జేమ్స్, ముంతాజ్, రాజ్యలక్ష్మి, జూటూరురవి, కిషోర్, గున్నామర్క్, తిమ్మోజీ, పాల్‌రాజ్, రాజు, వార్డు నాయకులు, బూత్‌ఇంచార్జీలు, నగరపాలక కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యకర్తలకు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విజయవాడ వరద బాధితులకు సేవలు అందించిన ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కార్యకర్తలకు సిపిఎం రాష్ట్ర నాయకులు పి.నిర్మల అభినందించారు. ఆమె వారికి జ్ఞాపికాలు అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షతన జరిగిన అభినందన సభలో పి.నిర్మల మాట్లాడుతూ బుడమేరుకు గండి పడి రెండు లక్షల మంది ఆపదలో ఉన్న సమయంలో కర్నూలు జిల్లా నుండి వెళ్లి సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులకు జ్ఞాపికలు ఇచ్చి అభినందించారు. గతంలో కర్నూలులో వరదలు వచ్చినప్పుడు కూడా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కార్యకర్తలు సేవలందించారని తెలిపారు. అదే రీతిలో ఆపదలో ఉన్న విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి వెళ్లి అక్కడ భారీగా నీళ్లు ఉన్నపటికీ ప్రాణాలు తెగించి ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యకర్తలు సేవలందించారని, అలాగే విద్యార్థులు నిరుద్యోగుల దగ్గర విరాళాలు సేకరించి విజయవాడ వరద బాధితులకు పంపించారని తెలిపారు. సేవలందించిన వారందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. అనంతరం అందరికీ జ్ఞాపకాలు అందించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర నగేష్ నగర కార్యదర్శి హుస్సేన్ భాష నాయకులు వినోద్ ,వీరేశ్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప నగర కార్యదర్శి సాయి ఉదయ్, నాయకులు ఖాజా బాషా, మల్లేష్ ఆర్యన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చాగలమర్రి

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి అంజలి

చాగలమర్రి పట్టణంలోని పాత గ్రామ పంచాయితీ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలం లోని వివిధ గ్రామాల పారిశుధ్య కార్మికులకు, హరిత రాయబారులకు ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీడీవో మహబూబ్ దౌలా, ఈఓఆర్‌డి తాహీర్‌హుసేన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో విశిష్టమైనవని, వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ అంజలి 40 మందికి పైగా పారిశుధ్య కార్మికులకు ఈసీజీ, రక్త, వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 24 మందికి మెరుగైన చికిత్స కోసం రెఫర్ చేసారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల, పంచాయితీ కారదర్శులు వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, ఎల్‌టి నాయక్, ఎంపిహెచ్ఏ మనోహర్, ఎంఎల్‌హెచ్‌పిలు, సచివాలయాల సిబ్బంది, వైద్య,ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ ఇఒగా కె. శోభారాణి నియామకం

ప్రజాశక్తి - మహానంది :

మహానంది దేవస్థానం ఇఒగా కె. శోభారాణిని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా మహానంది దేవస్థానానికి డిప్యూటీ కమిషనర్ హోదాలో ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇన్‌ఛార్జ్ ఇఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న నల్లకాల్వ శ్రీనివాస్ రెడ్డిని బదిలీలో భాగంగా పల్నాడు జిల్లా అమరేశ్వర స్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. మహానంది దేవస్థానంలో ఎఇఒగా విధులు నిర్వహిస్తున్న ఓ. వెంకటేశ్వర్లు అనంతపురం జిల్లా కసాపురం క్షేత్రానికి, అలాగే మహానంది ఆలయంలో విధులు నిర్వహించే ఎస్. హరినాథ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీశైలం దేవస్థానంనకు బదిలీ అయ్యారు. శ్రీశైలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు మహానంది ఆలయానికి బదిలీపై వచ్చారు. వీరిలో మహానంది ఆలయానికి ఎఇఒగా ఎం. హరిదాస్, సూపరింటెండెంట్‌గా పి .దేవిక, సీనియర్ అసిస్టెంట్లుగా కే. జగదీశ్వర్ రెడ్డి, పి. సుబ్బారెడ్డిలు, జూనియర్ అసిస్టెంట్లుగా వి. వెంకటలక్ష్మి, కే. అనురాధ, ఎస్. లోకేశ్వరప్పలు నియమితులయ్యారు.

బదిలీపై వెళ్తున్న అధికారులను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

మహానంది ఆలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళు_న్న ఎఇఒఒ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ హరినాథ్‌లను దేవస్థాన కార్యాలయంలో సత్కరించి, స్వామివారి శేషవస్త్రాలు, వేద పండితుల ఆశీర్వచనాలతో ఆలయ ఎఇఒ మధు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-పత్తికొండ

వయోవృద్ధులు, పారిశుధ్య కార్మికులు ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ (గైనకాలజిస్ట్)డాక్టర్ కల్పన అన్నారు. సోమవారం పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో స్వచ్ఛతా హీ సేవ 2024 కార్యక్రమంలో డాక్టర్ కల్పన, ఎండి జనరల్ మెడిసిన్ సివిల్ అసిస్టెంట్ సర్జరీ స్పెషలిస్ట్ ఆది నాగేష్ మాట్లాడారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. 60 సంవత్సరాల పైబడిన వయోవృద్ధులు, పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సమస్యలు పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకొని సూచనలు, సలహాలు పాటించాలని అన్నారు.150 మంది వరకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. సీజినల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమతంగా ఉండి ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ డాక్టర్లు వెంకటేశ్వర్లు, ఇఎన్‌టి డాక్టర్ శరన్. ఆర్థోపెడిక్ డాక్టర్ ఆనంద్, డాక్టర్ మానురాజు, కెపిఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై జగన్మోహన్

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్స్‌కు పెండింగులో ఉన్న వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు కువినతి పత్రం అందజేశారు. అంజిబాబు మాట్లాడుతూ గత పది నెలలుగా క్లాప్ డ్రైవర్స్‌కు వేతనాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. అనేక ఆందోళనలు చేసినా అధికారులను , ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేసినా ఇప్పటికీ వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. సిఐటియు నగర నాయకులు మహమూద్ ,కుమార్, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు షఫీ, శీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : ఎస్ఐ

పజాశక్తి - బండి ఆత్మకూర్

విద్యార్థిని, విద్యార్థులు చదువును కష్టంగా గాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి చదివిన పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. ఎర్రగుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సోమవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థిని విద్యార్థులు సైబర్ నేరగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అసభ్యకర మాటలు మాట్లాడే వారి వద్దకు వెళ్ళవద్దని సూచించారు వివిధ ఆకర్షణకులోనై ప్రేమ పేరుతో తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. చదువుకు సంబంధించిన విషయాలను మాత్రమే ట్యాబుల ద్వారా తెలుసుకోవాలని, ఉపాధ్యాయులు సూచించిన ప్రతి విషయాన్ని గమనించి విద్యను అభ్యసించాలన్నారు. పాఠశాల విద్యతోనే మీ భవిష్యత్తుకు పునాది పడుతుందని చెప్పారు. క్రమశిక్షణతో చదువు, ఆటల్లో ప్రావీణ్యం పొంది ముందుకు సాగాలని తెలిపారు. శ్రద్ధతో చదువుకొని మంచి మార్కులు సాధిస్తే.. భవిష్యత్‌లో ఒకరికి తలొంచకుండా జీవితాన్ని ఉన్నతంగా గడపొచ్చని సూచించారు. మీరు మంచిగా చదువుకొని ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు మీ తల్లిదండ్రులు గర్వపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు చక్రాల సైకిల్ ను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వికలాంగులైన బడి ఆత్మకూరుకు చెందిన రమణారెడ్డి, మిట్నాల వేణుగోపాల్‌లకు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సోమవారం మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు.

నేటి నుండి 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం నేటి నుండి ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24న ఉదయం మండలంలోని యాగంటి పల్లె, సాయంత్రం మీరాపురం, 25న పసుపుల, పాతపాడు గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. **రుద్రవరం :** ప్రతి వారం మంగళ, బుధవారాల్లో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాల్లో వివిధ గ్రామాల్లో ప్రతిరోజు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టబోతుందన్నారు. **అవుకు :** అవుకు మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నేటి నుండి ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ తెలిపారు. 24 నుంచి ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాలలో దశలవారీగా చేపట్టనున్నట్లు తెలిపారు. మంగళవారం సంఘపట్నం, చనుగొండ్ల, బుధవారం రామాపురం, చెర్లోపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానానికి భక్తులు విరాళం ఇచ్చినట్లు ఈవో కామేశ్వరమ్మ తెలిపారు. సోమవారం ఉయ్యాలవాడ మండలం ఇంజేడు గ్రామానికి చెందిన సంకేపల్లి వెంకట చెన్నారెడ్డి, కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయానికి రూ. 30 వేలు నగదును ఇఒ జి.కామేశ్వరమ్మకి అందచేశారు.

దేవస్థానానికి విరాళం ఇస్తున్న భక్తులు